
# చిన్ని గుండెల చప్పుళ్ళు

శ్రీమతి సి. ఉమాదేవి



నగరం పల్లెలా బద్ధకంగా ఆవలించడం లేదు. ఆవలింతలావుకుని లేని ఓపిక తెచ్చుకుని గబగబా మేల్కొంటోంది. ఆదిత్యుని తిమిర సంహారణ కన్నా ముందే పాల వ్యానులు పరుగులు తీస్తున్నాయి. కాఫీ చుక్క పడందే తెలవారని బెడ్‌కాఫీ ప్రియులకు, 'పాలు కడుపులో పడ్డాకే బడికి వెళ్తాను' అనే చిన్నారులకు, చెవులలో క్షీరామృతపు తాలూకు కేకలు, బజర్ మోతలు, సైకిల్ గణగణలు, గేదె పాలలో వెన్నశాతం కన్నా, దారిలో కనపడ్డ బోరింగ్ నీటిశాతం మిన్నగా జోడించి అమ్మే స్కూటరిస్టుల క్యానుల డబడబలు వెరసి అయోమయపు "నగర జీవితం ఇంత చక్కగా తెలవారుతోందా?" అని నోరెళ్ళబెట్టి చూస్తున్నాడు ఈ మధ్యనే నగరం చేరిన కొమరయ్య.

కొమరయ్య భార్య సత్తెమ్మ సత్తెకాలపు ఇల్లాలు. కడుపు చల్లబడితే చాలు కాళ్ళు డొక్కదాకా దోపి మునగదీసుకుని పడుకునే భాగ్యం భాగ్యనగరం చేరాక కరువై నగర జీవనానికి, జీవికకు ఆధారమైన ధరల బలుపునకు బెంబేలెత్తి, రోజులో ఒక్కసారైనా 'మనవూరు పోదాంరా అయ్యా!' అని భర్తను అడిగి భంగపడే అర్భక ఇల్లాలు.

కొమరయ్యది ఒకప్పుడు ఓ విధంగా జల్సా జీవితమే! నాటు సారాలో నాణ్యత వెతుక్కుంటూ వున్న నగా నట్రా, పొలం పుట్రా వూరికే అంకిత మిచ్చి, కేవలం డొక్క, రెక్క మిగుల్చుకుని నగరానికి చేరుకున్నాడు. అల్లువు తెలియని శరీరానికి నగర వేగం అలసటే కాదు. విసుగునూ కలిగించింది. అయినా తప్పదు. వూలమ్మిన చోటే కట్టెలమ్మలేక జరీ కండువా స్థానే గళ్ళ తువాలు భుజాన వేసుకుని, దగ్గర్లోని మిల్లు సైరను మ్రోగింది మొదలు పని వెదుకులాటలో నగరాన్ని కాళ్ళతో కొలుస్తూ వెళ్తాడు.

ఊరు వదలి వచ్చేటప్పుడు తెచ్చుకున్న జొన్న నూక అవురావురన్న నాలుగు కడుపులకు అంబలే పరమాన్నమనిపించింది. మరిక్కడ అదనంగా చేరిన కడుపులు కొమరయ్య కొడుకులు 'ఓబులేశు, మల్లేశుల'వి. బానలోకి తొంగి చూసింది సత్తెమ్మ. నూకలు నిండుకుంటున్నాయి. బాన, 'కడుపు ఖాళీ' అవుతోందన్న దిగులేమో!సత్తెమ్మ చేతినుంచి జారిపడి భళ్ళున ముక్కలైంది. నూకలు చెల్లాచెదరయ్యాయి చెదిరిన సత్తెమ్మ గుండెలా! రొట్టె కాల్చుకోవడానికి పగిలిన పెంకుముక్క తీసి దాచింది సత్తెమ్మ నష్టంలో పరిహారాన్ని వెతుక్కుంటూ. 'నూకలూ ఖతమైపోయె, జరీపిండీ గట్టా లేకపోయె'. ముఖమంతా అలముకున్న చెమట బిందువులు ప్రశ్నార్థకాలుగా మెడదాకా జారుతున్నాయి.

"తప్పదు. ఇవాళ పని ఎలాగైనా సంపాదించాలి. కొడుకుల కష్టం తింటుండవని భార్య ఇజ్జత్ తీస్తది". ఇదే ఆలోచన నడకలో వేగాన్ని మరింత పెంచింది. అడుగులో వేగానికి మేకు బాకులా దిగింది అరికాలును ఎర్రటి నీళ్ళతో కడుగుతూ. 'నీ వంట్లో ప్రవహించేది నెత్తురు కాదు, సారా' అని అరిచేవారికి కొమరయ్య సమాధానం లేని ప్రశ్న! కాలికంటిన రక్తాన్ని గళ్ళ తువ్వాలంతా అలికి కుంటుకుంటూ ఇంటి దారిపట్టాడు కొమరయ్య.


కళ్ళల్లో ప్రాణం పెట్టుకుని పడుకున్న కొడుకులను లేపలేక లేపింది సత్తెమ్మ. 'అమ్మా! లేపకే, ఇంకా నిద్దరొస్తోంది" కొడుకుల వేడికోలు ఆమె చెవులకు బాధాకరంగా సోకినా కొమరయ్య కాఠిన్యం ఆమెను బండ శిలగా మార్చాయి.

"మీ అయ్యకు కూలి ఎక్కువిచ్చి ఎవరు పనిలోకి తీసుకుంటారు? అయ్యకు పని దొరక్కుంటే మీరు పనిలోకెళ్ళాలి గదా".

"ఏందమ్మా! అయ్యకు పని ఎందుకియ్యరు? మరి మమ్మల్నెందుకు పిలుస్తారూ?"

"అదంతా కూలికి పిల్చేవారికి తెలియాలి". బాల కార్మికులకు వేతనం తక్కువ. పని ఎక్కువ. ఈ వ్యాపార మాత్రం తెలియని ఇల్లాలామె.

మల్లేశు, ఓబులేశు గుండెలలో దిగులు విశాలంగా పరుచుకుంటోంది. సైరన్ రెండవ కూత కల్లా లైనులో వుండాలి. కడుపు నిండా చల్ల లేకపోయినా చల్లనీరు పోస్తుంది అమ్మ. మిల్లుకు 'టీ' తెచ్చి అమ్మే కుర్రాడు టీకి ఎనభై పైసలు తీసుకుంటాడు. తెచ్చి ఇచ్చినందుకు ఇరవై పైసలు తీసుకుంటాడు. సాయంత్రందాకా పనిచేస్తే తామిద్దరికీ దొరికేది నలభై రూపాయిలే. అదీ వారానికొకసారి ఇస్తారు. ఆరోజు నాన్న గద్ద అవతారం దాలుస్తాడని వాళ్ళకు తెలుసు. చెట్టుక్రింద నీడ దొరికినా ఎండకూ, వానకూ తట్టుకోలేక అద్దె ఇల్లు అనబడే చిన్న గుహలో తలదాచుకోవడానికి ముక్కుపిండి మరీ వసూలు చేస్తాడు మస్తానయ్య.



అమ్మ, అయ్య కొట్లాట లేకుండా హాయిగా వుండాలంటే తామిద్దరూ కష్టపడాలి. తండ్రి దెబ్బలకు తల్లి కళ్ళల్లో వూరే నీళ్ళు చూసినప్పుడల్లా ఎవరైనా పైసలు పెట్టి తాగిన చేదు టీ కాస్తా ఇంకా విషంలా మారి కడుపులో మంట ఎగదన్నుకొస్తుంది. మ్రోగిన సైరన్ కూతకు ఉలిక్కిపడి చప్టీటిని వుక్కిట పట్టి పరుగెత్తారు ఓబులేశు, మల్లేశు.

*** *** ***

కన్నుల్లో ఎర్రని జీరలు, కోరమీసాల మాటున ఒంద్రపెడుతున్న మోటుపెదాలు.. ఇవి చాలు ఎంతమందిలో వున్నా సాంబయ్యను గుర్తించడానికి. "మిమ్మల్ని తగలెయ్య. ఏమిటా నీలుగుడు. త్వరగా తగలడండి. లారీలు వచ్చి గంటయ్యింది. మాల్ ఇంతవరకు ఒక్క లారీకెక్కలా. అరేయ్! అందరూ పోరగాండ్రను ఇట్టా తోలుకరాండ్రా! ఎదవలు, తప్పండి. ఒక్కొక్కడిని ఎవడైనా బద్ధకంగా నిలిగాడంటే! గంట లోపల లారీ నిండాల". రంకెలేస్తున్నాడు సాంబయ్య.

బస్తాల్లో ఊక రంపంలా వీపును కోస్తోంది. హోటళ్ళకు గ్యాస్ పొయ్యిలే కాదు. ఊక నింపిన గాడిపొయ్యిలూ అవసరమే. ఊక వేడి వీపును పెనంలా వేయిస్తోంది. కడుపులో ఆకలి ఎక్కువై వికారం మొదలైంది. ఒళ్ళు తూలుతోంది మల్లేశుకు. మల్లేశు ఓబులేశు కన్నా ఒక్క ఏడాదే చిన్న. పుస్తకాల సంచీ భుజాన వేసుకుని బూట్లు టకటకలాడిస్తూ రిక్షాల్లో, ఆటోల్లో వెళ్ళే చిన్నారులను చూసి తామెందుకు బడికి వెళ్ళలేమో? అనే అయోమయంలో పడిపోయేవాడు. అన్న అదిలింపుతో ఉలిక్కిపడ్డ ఒళ్ళును స్వాధీనంలోకి తెచ్చుకుని, ఇంచుమించు తనంత వున్న బస్తాను వీపున ఎక్కించుకుని భారంగా అడుగు వేయబోయాడు. ఊహూ! సాధ్యం కాలా! కుప్పకూలిన మల్లేశును లేపాలంటే భుజాన బరువు వదలడు. బస్తా క్రింద పడి పగిలిన తీరు మల్లేశులో భయప్రకంపనలు రేపి లేత ముఖాన్ని వికృతపరుస్తున్నాయి. ఉలికిన కన్నీరును ఉగ్గబట్టుకుని లారీవైపు భారంగా కదిలాడు ఓబులేశు...

"ప్రక్కకీడ్చేయండి నా కొడుకుని తిండి తిని చావడు పొద్దుటే వెధవ. సాంబయ్య జుత్తు పీక్కుంటూ ఊక మధ్యలో చిందులేస్తున్నాడు. చిరిగిన బస్తా ప్రక్కకు లాగి మోచేతిని అతుక్కున్న ఊకను విదుల్చుకుని లేచి నిలబడ్డాడు మల్లేశు.

సాంబయ్య చేయి చాచి బలంగా లాగిన విసురుకు భుజంలో ఎముక విరిగినట్టు కలుక్కుమంది. సాంబయ్య వీపు క్రింద వూక పరచాలన్నంత కోపం వచ్చింది మల్లేశుకు.

"కానియ్యండి వెధవల్లారా. మెయిన్ రోడ్లలో లారీలు బంద్ చేసే టైమయింది..థూ..థూ.. ఊకలోనే ఉమ్మేస్తూ వికారంగా రంకెలు పెడ్తున్నాడు సాంబయ్య. తన చేతుల వైపు చూసుకున్నాడు ఓబులేశు. కందిపోయిన అరచేతులు మంటపెడుతున్నాయి. అరచేతిలో కర్పూరం వెలిగించుకున్నట్టు.

బాధ్యత పట్టని తండ్రి. బరువు పనులు చేయలేని తల్లి. తమ బాల్యాన్ని ఇలా లారీ చక్రాల క్రింద నలిపేస్తారని తెలియక పట్నంలో పిల్లల్లా తామూ చదువుకుంటామని, వెన్నెల్లో తాను, తమ్ముడు బోలెడన్ని కథలు చెప్పుకుంటూ నిద్రపోతామని కలలుగన్న కనులకు వాస్తవమంతా చేదుగా దర్శనమిచ్చేసరికి తమను కన్నవారిపై విసుగు, తక్కువ కూలికి ఎక్కువ పని చేయిస్తూ భుజాలన్నీ పచ్చి పుండ్లుగా మారినా, 'ఎద్దుపుండు కాకికి రుచి' అన్నట్టు నొప్పితో మొద్దుబారిన భుజాలనే పట్టి తోస్తూ తమ చిన్ని మనసుల్ని చిదిమి వేస్తూ తమపై పెత్తనం చెలాయించే సాంబయ్య ప్రవర్తనకు, ఒక రూపమిచ్చి భాష్యం చెప్పలేని అశక్తులు ఓబులేశు, మల్లేశులు.

నగర కాలుష్యాన్ని చందమామను, నక్షత్రాలను తమ చిన్నగది కిటికీ నుంచి కళ్ళన్నీ నిక్కించి చూస్తూ నిద్రలోకి జారుకున్నారు మల్లేశు. ఓబులేశు. అలసిన శరీరాలు విశ్రాంతి పొందుతున్నా గుబులు గుబులుగా వున్న ఈ చిన్ని గుండె చప్పుళ్ళు విన్పించేదెవరికి?